క్లుప్తంగా

బోనాల సందడి



కాటారం: కాటారం మండల కేంద్రంలోని వివేకనంద పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా బోనం ఎత్తారు. పోతరాజు వేషాధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వలుస వందన మాట్లాడుతూ.. బోనాల పండుగను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదయాలకు సంబంధించిన అంశాలను తెలియపర్చడం ఆవశ్యకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కాటారం: కాటారం సర్పంచ్‌గా తోట రాధమ్మ శనివారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. పదిహేను రోజుల క్రితం రాధమ్మ అనారోగ్య కారణాలతో వైద్య పరీక్షల కోసం వెళ్తున్నట్లు సెలవు పెట్టారు. దీంతో కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్‌కు ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాధమ్మ సెలవును రద్దు చేసుకోవడంతో తిరిగి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీఓ ఉపేంద్రయ్య, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్‌తో పాటు వార్డు సభ్యులు, పలు కుల సంఘాలు, హమాలీ సంఘం నాయకులు రాధమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



మహాముత్తారం: మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం సర్పంచ్ కొడపర్తి మల్లిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు విద్యతో పాటు పోషకాహారాలు అందిచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, శైలజ, వార్డుసభ్యులు గట్టయ్య, ఏఎన్ఎం రజిత, గర్భిణులు, ఆయాలు తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఓ) శ్రీనివాస రాజు శనివారం తనిఖీలు చేశారు. పలు ఎరువుల విత్తనాల షాపుల్లో కొంత మంది డీలర్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే రైతుల సమాచారంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, విత్తనాలు స్టాక్ వివరాలను తనఖీ చేశారు. ప్రతి రైతుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు.

జాగ్రత్తలు పాటించాలి



వెంకటాపురం(ఎం): వర్షాకాలం దృష్ట్యా గొత్తికోయలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. మండలంలోని అడవిరంగాపురం పరిధిలోని బండ్లపాడు గొత్తికోయగూడెంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 67 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. రాత్రివేళల్లో దోమతెరలు వాడాలని గొత్తికోయలకు సూచించారు. అనారోగ్యానికి గురైతే స్థానిక ఎఎన్ఎంలకు, ఆశ వర్కర్లకు సమాచారం అందించాలన్నారు. జ్వరాలు, వాంతులు, విరోచనాలకు గురైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఉప కేంద్రంలో వైద్య సేవలు పొందాలని గొత్తికోయలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన, సీహెచ్ఓ సదానందం, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఎల్‌టీ కృష్ణ, స్టాఫ్‌నర్సు జ్యోతి, ఎఎన్ఎం శోభారాణి, ఆశ వర్కర్లు కవిత, అన్నపూర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు



బోనాలతో మహిళలు



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న సునీల్‌రెడ్డి

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో బొడ్రాయి గ్రామ దేవతల ప్రతిష్ఠాపన శనివారం వైభవంగా నిర్వహించారు. శనివారం వేదపండితల మంత్రోచ్ఛరణల నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. గ్రామ పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠాపన, చండీ హోమం, బొడ్రాయి ఊరేగింపు, అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు బొడ్రాయి పవిత్రతను, ప్రతిష్ఠాపన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

గ్రామ దేవతల కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఆకాంక్షించారు. చిన్నతూండ్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాన కార్యక్రమంలో సునీల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులకు విరాళం అందించారు. అనంతరం కమిటీ సభ్యులు సునీల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి గిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గంగాధర సమ్మయ్య, నాయకులు అశోక్, మహేష్, శ్రీను, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

మహాముత్తారం: ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందానికి పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రత్నం సుభద్ర అధ్యక్షతన మండలంలోని ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాటాడుతూ.. 13వ విడత జరుగనున్న సామాజిక తనిఖీ ఆడిట్ బృందానికి ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పనుల వివరాలతో పాటు రికార్డులను వారికి సరైన సమయంలో అందజేసి సహకరించాలని సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ జరిగిన పనులకు మాత్రమే రికార్డులు ఇచ్చి ఆడిట్ చేయించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అదనపు కార్యక్రమ అధికారి ఎం కుమారస్వామి, వెంకన్న, జూనియర్ ఇంజనీర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రసాద్, రవీందర్, ప్రమీల, కంప్యూటర్ ఆపరేటర్ల రాజ్‌కుమార్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని పెద్దకుంటపల్లి తండాలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీన్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకుంటపల్లి తండాలో ఎక్సైజ్ అధికారులు గ్రామంలో 550 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 26 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు తయారుదారులైన నంగవత్ సమ్మయ్య, ప్రేమ్‌సింగ్, భూక్యామంగ్యా, జరుపుల రాజశేఖర్, భూక్యారాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ అధికారులు మోహన్‌బాబు, రాజసమ్మయ్య, ఎస్సై మాన్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

వంటను అడ్డుకున్న కార్మికులు



వంట పాత్రలో నీరు పోస్తున్న కార్మికులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు వంటను వండుతుండగా భోజన కార్మికులు శనివారం అడ్డున్నారు. ఉపాధ్యాయులు భోజనం కోసం పొయ్యి ఏర్పాటు చేయగా మంటను ఆర్పీ వంట పాత్రలో నీళ్లు పోశారు. తాము సమ్మెలో ఉన్నామని తమకు సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు. దీంతో విద్యార్థులు ఇళ్లల్లోకి వెళ్లి భోజనం చేసి తిరిగి పాఠశాలకు వచ్చారు. విద్యార్థులకు ఇబ్బందికరంగానే ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు మరింత భారం



పుస్తకాలతో పాటు, టిఫిన్ బాక్సు తీసుకెళ్తున్న విద్యార్థి

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె ప్రకటించడంతో విద్యార్థులకు పుస్తకాలతో పాటు, మధ్యాహ్న భోజన టిఫిన్లు మరింత భారంగా మారాయి. ఐదవ తరగతి లోపు విద్యార్థులు ఉన్న పుస్తకాలనే మోయలేక ఇబ్బంది పడుతుంటే దానికి తోడు మరొక బ్యాగ్‌లో మధ్యాహ్న భోజనాన్ని వెంట తీసుకువెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాల బరువు, రెండు చేతుల్లో టిఫిన్ కవర్లు తీసుకెళ్తున్న విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో పాఠశాలకు వెళ్త ఇబ్బంది పడ్డారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

కాటారం: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు మీస రాజమల్లయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పుస్తక పఠన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం వల్ల మేథాశక్తి పెంపొందడంతో పాటు పలు విషయాలపై అవగాహన కల్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంపత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన పోడుదారులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

మహాముత్తారం: పోడు భూమి సాగు చేసుకుంటున్న ప్రతీ ఒక్కరికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి అర్హులందరకీ పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కాకుండా కొంత మందికి మాత్రమే పంపిణీ చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం మరోసారి మొకా సర్వే చేయించి సాగుదారులందరికీ పట్టాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి పూర్ణ చందర్, గిరిజన మోర్చా అధ్యక్షుడు చాట్ల అంజిబాబు, యువమోర్చా నాయకులు బండ శ్రీకాంత్ పటేల్, సందీప్, బక్కతట్ల రాజు, రాజ్‌కుమార్, జాగరి మల్లేష్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

మహదేవపూర్: తమ్ముడిపై అన్న దాడి చేసిన ఘటనలో అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుదురుపల్లి గ్రామనికి చెందిన తమ్ముడు తిరుపతిపై అన్న మధుకర్ దాడి చేశాడు. ఈమేరకు తిరుపతికి గాయాలు కాగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మధుకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..'

కాటారం: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కొత్తపల్లి సర్పంచ్ అజ్మీరా రఘురాం నాయక్, ఎంపీటీసీ హట్కర్ రూప అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు భిక్షతో పదవులు అనుభవించి ఆర్థికంగా ఎదిగి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన కాటారం మండలానికి చెందిన ఓ నాయకుడు విమర్శలు చేయడం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ, శ్రీధర్‌బాబను విమర్శించే స్థాయి ఆ నాయకుడిది కాదని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి సదయ్య, మాజీ అధ్యక్షుడు చిట్యాల చంద్రయ్య, అజ్మీరా తిరుపతి, చిలుముల అశోక్, సుందిళ్ల ప్రభుదాస్, ఉప్పుల తిరుమల్, పాగె చంటి, కోటేశ్వర రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి ఏపీజీవీబీ



భవనాన్ని ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి

టేకుమట్ల: ఖాతాదారుల సౌకర్యార్థం మండల కేంద్రంలోని నూతన భవనంలోకి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను మార్చినట్లు రీజినల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏపీజీవీబీని శనివారం నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ మంగేష్‌ను చాంబర్‌లో కూర్చోబెట్టి శ్రీధర్‌రెడ్డి పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో బ్యాంక్ సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు రవి, ప్రశాంత్, నవీన్, బ్యాంక్‌మిత్ర, గ్రామ దీపికలు ఉన్నారు.

గ్రామాల్లో పశువులకు నాటువైద్యం



కాడెద్దుకు వాతలు పెడుతున్న రైతు



కొడిపెలను వేడిచేస్తున్న రైతు

మహాముత్తారం: ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నప్పటికీ కొన్ని విషయాల్లో ఇప్పటికీ పురాతన పద్ధతిని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పాటిస్తున్నారు. గ్రామీణ వ్యవసాయ రంగంలో ప్రధాన భూమిక పోషించే కాడెడ్లకు నాటు వైద్యంతో పలు వ్యాధులను నయం చేస్తున్నారు. నాటువైద్యంతో వేడి కొడిపెల ద్వారా వాతలు పెట్టి నివారిస్తున్నారు. మహాముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో నేటికీ నాటువైద్యం ద్వారా కాడెద్దులు, బర్రెలు, గొర్రెలు, మేకలకు సొమ్మ, జబ్బవాపు, కాలువిరిగినా కట్లు కట్టడంతో పాటు ఆకుపసర్లతోని, వేడి కొడిపెల ద్వారా పశువులకు వచ్చే వ్యాధిని బట్టి వాతలు పెడతారు. దీని ద్వారా రోగం పూర్తిగా నయమతున్నట్లు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం చేసే రైతులు పేర్కొంటున్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



కాటారం: కార్మికుల దీక్షలో పాల్గొన్న సునీల్‌రెడ్డి



చిట్యాల: జెడ్పీటీసీకి వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది



మహదేవపూర్: వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు



భూపాలపల్లి రూరల్: దీక్షలో పాల్గొన్న చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు సమస్యలు తమ పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా కేంద్రలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకుకీర్తిరెడ్డి సంఘీబావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఇచ్చంతుల విష్ణు, అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ అధికార ప్రతినిధి బట్టు రవి, ఉపాధ్యక్షుడు కూర సుధాకర్, నాయకులు తోట ఓదేలు, నాంపల్లి కుమార్, వేణు, సీనియర్ నాయకులు గీత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం/మల్హర్: గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాటారం, మల్హర్‌లో కార్మికులు చేపట్టిన సమ్మెలోకు శనివారం సునీల్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. చిన్న ఉద్యోగులపై అధిక పని భారం మోపడంతో పాటు వారికి సరైన జీతాలు చెల్లించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. కాటారంలో జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుముల విజయారెడ్డి, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి బండం మల్లారెడ్డి, గంట అంకయ్య, పూసాల రాజేంద్రప్రసాద్, దోమల సమ్మయ్య, బొంతల రవి, కార్మికుల సంఘం నాయకులు దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, కొండయ్య, శశికుమార్, మల్హర్‌లో అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి గిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గంగాధర సమ్మయ్య, చందు, పాషా పాల్గొన్నారు.

మహాముత్తారం/మహదేవపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి పదవ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది వంటావార్పు చేసి నిరసన తెలిపారు.

జెడ్పీటీసీకి వినతి

చిట్యాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మండల అధ్యక్ష, కార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమారస్వామి శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ గొర్రె సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జీపీ సిబ్బంది కార్యాలయం వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి

మంగపేట: పిల్లలను అనారోగ్య బారిన నెట్టే నులిపురుగులను నివారించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అల్లి నరేష్ కోరారు. మండలంలోని మంగపేట, చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో శనివారం టాస్క్‌ఫోర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నులిపురుగుల వలన పిల్లల్లో వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు. అనంతరం వైద్యాధికారి యమున మాట్లాడుతూ పిల్లల కడుపులో నులిపురుగులు ఉండటం వలన వారు తీసుకునే ఆహారం వాటికి చేరడంతో పిల్లలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. నులిపురుగులను నిర్మూలిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అందుకు గాను 1 నుంచి 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరూ ఆల్బెండాజోల్ మాత్రలను తీసుకోవాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో పాటు ఇంటి వద్ద ఉండే పిల్లలందరికీ మాత్రలు తినిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్, మండల ఇంచార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మల్హర్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గూడెపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు పార్వతి రాజమల్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఎద్దు పచ్చిక మేయడానికి తాడిచర్ల శివారులో మానేరు ఫీడర్ వైపు వెళ్లిందని తెలిపారు. పచ్చిక మేస్తున్న క్రమంలో పూర్తిగా కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్ గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.